క్లుప్తంగా

శ్రీ సత్యసాయి జిల్లాలో క్రికెట్ సబ్ సెంటర్


శివనాథ్‌ను కలిసిన జేశాప్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

పుట్టపర్తి అర్బన్: శ్రీ సత్యసాయి జిల్లాలో క్రికెట్ క్రీడాకారుల కోసం క్రికెట్ సబ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు కేశినేని శివనాథ్ భరోసా ఇచ్చినట్లు జేశాప్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం విజయవాడలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీని విజయ్‌కుమార్, రత్నాకర్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శివనాథ్ జిల్లాలో ప్రతిభ ఉన్న క్రీడాకారులు ఉన్నా సరైన వసతులు లేవని, అతి త్వరలోనే సబ్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పినట్లు విజయ్‌కుమార్ తెలిపారు.

మాల్యవంతంలో వైద్య శిబిరం

బత్తలపల్లి: మండలంలోని మాల్యవంతంలో రెడ్‌క్రాస్, పిరమిడ్ కేంద్రం ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్ నరసింహులు ఆధ్వర్యంలో 50 మంది వృద్ధులకు కంటి పరీక్షలు చేశారు. వైద్య శిబిరానికి పుల్లారెడ్డి జ్ఞాపకార్థం స్పాన్సర్‌గా నరేంద్రరెడ్డి, నారాయణరెడ్డి సహకారం అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు శివయ్య, జయసింహ, సత్య నిర్ధారణ, భారత సేవరత్న అవార్డు గ్రహీత టీడీ జయరామిరెడ్డి, తాడిమర్రి భారతసేవ రత్న అవార్డు గ్రహీత వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థినులు

కదిరి టౌన్: ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అనంతపురంలో జరిగిన హ్యాండ్ బాల్ సెలక్షన్ పోటీలో రాష్ట్ర స్థాయికి కదిరి విద్యార్థినులు ఎంపికైనట్లు పీడీ శంకర్‌నాయక్ తెలిపారు. కదిరికి జెడ్పీహెచ్ స్కూల్‌కు చెందిన బాలికలు అండర్-14లో స్వప్న, అండర్-17లో సాయిప్రియ,అర్చన, సమీర రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు వారిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

జీవాల కాపరిపై కేసు నమోదు

తలుపుల: మండలంలోని పెద్దన్నవారిపల్లికి చెందిన జీవాల కాపరి గంగార్జునపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ రామక్రిష్ణ తెలిపారు. వివరాలు.. రైతు గంగులయ్య మామిడి తోటలో కొమ్మలు నరికి కాపరి గంగార్జున మేకలు మేపుతుండగా.. గంగులయ్య అడ్డుకున్నాడు. 'నీకు దిక్కువున్నచోట చెప్పుకో' అంటూ కాపరి దౌర్జన్యానికి పాల్పడ్డాడు. రైతు ఫిర్యాదు మేరకు కాపరిపై కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ఘనంగా ప్రపంచ వృద్ధుల దినోత్సవం


వృద్ధులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

పుట్టపర్తి రూరల్: ఎనుములపల్లిలోని నిరాశ్రయుల వసతి గృహంలో మంగళవారం ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి డాక్టర్ నివేదిత వృద్ధులు పాటించాల్సిన ఆహార నియమాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. వృద్ధాప్యంలో వచ్చే సమస్యలు తెలియజేయడంతోపాటు వాటిని ఎలా అధిగమించాలో తెలియజేశారు. అనంతరం వృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. వ్యాధి నిరోధక అధికారి బాలాజీనాయక్, డాక్టర్ జ్యోత్స్న, సీహెచ్‌ఓ నగేష్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎస్‌ఐ శ్రీనివాసులు

బత్తలపల్లి: స్థానిక శివాలయం వద్ద నార్పల మండలం బి.పప్పూరుకు చెందిన రవి నుంచి 50 మద్యం బాటిళ్లను ఎస్‌ఐ శ్రీనివాసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఏఎస్‌ఐ నాగరాజు, కానిస్టేబుళ్లు సుదర్శన్‌నాయుడు, నారాయణస్వామి పాల్గొన్నారు.

ఇసుక లేక ఆగిన ఇళ్ల నిర్మాణాలు

- కర్ణాటకకు తరలిపోతున్న ఇసుక
- మధ్యలో నిలిచిపోయిన నిర్మాణాలు
- పనుల్లేక ఇబ్బందులు పడుతున్న కార్మికులు


ఇసుక లభించకపోవడంతో మధ్యలోనే నిలిచిపోయిన ఇంటి నిర్మాణం


చిత్రావతి నది నుంచి ఇసుకను తరలించకుండా చర్యలు తీసుకోవాలని ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జేసీని కోరుతున్న రైతులు

ధర్మవరం రూరల్: ఇసుక అందుబాటులో లేక నిర్మాణాలు సగంలోనే నిలిపోయాయి. ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోవడంతో సొంతింటి కల నెరవేరక లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం అధికారంలోకొస్తే ఉచిత ఇసుక ఇస్తామని హామీ ఇచ్చి.. ప్రస్తుతం అధిక ధరలకు ఇసుక సరఫరా చేస్తున్నారు. అయినా ఎక్కడా ఇసుక దొరకపోవడంతో కార్మికులు, గృహ నిర్మాణ యజమానులు ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక పాయింట్, బుకింగ్ తదితర వాటిపై పూర్తి స్పష్టత లేకపోవడంతో ప్రజలు, ఇళ్ల నిర్మాణదారులు ఇబ్బందులు పడుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో..

గత ప్రభుత్వంలో ఇసుక సామాన్యులకు అందుబాటులో ఉండేది. ధర్మవరం మార్కెట్ యార్డ్‌లో ఇసుక డంప్‌ను ఏర్పాటు చేసి ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకుంటే ఇసుక లోడ్ చేసి పంపేవారు. దీంతో సామాన్యుడికి ఇసుక సులభంగా తక్కువ ధరకు లభించేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సామాన్యుడికి ఇసుక అందని ద్రాక్షలా మారింది. ధర్మవరంలో ఇసుక అందుబాటులో లేకపోవడంతో సుదూరంగా ఉన్న ఉప్పలపాడు, తాడిమర్రి మండలాలకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని గృహ నిర్మాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉచితమంటే సంతోషపడ్డాం

ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే ఇసుకను పూర్తిగా ఉచితంగా ఇస్తామని హామీ ఇవ్వడంతో తాము ఓట్లు వేసి ఉచిత ఇసుక కోసం ఎదురు చూశామన్నారు. అయితే ఇప్పుడేమో డబ్బులు చెల్లించాలని చెపుతున్నారు. ఇసుక లోడ్ చేసినందుకు, వాహనాల బాడుగకు తడిసిమోపెడవుతోందన్నారు. డబ్బులు కట్టి బుకింగ్ చేసుకున్నా సరైన సమయానికి ఇసుక దొరకడం లేదని గృహ నిర్మాణదారులు వాపోతున్నారు.

ఎక్కడి పనులు అక్కడే ...

గత ప్రభుత్వ హయాంలో మొదలు పెట్టిన ఇంటి నిర్మాణాలకు అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని నివాసాలకు చేయూత నిచ్చింది. ఇనుము, సిమెంట్, కడ్డీలు, తలుపులు, ఇతర ఇంటి సామగ్రిని అందించింది. ప్రస్తుతం ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. వందల కొద్దీ ఇళ్ల నిర్మాణాలు మొండి గోడలను తలపిస్తున్నాయి. ఇసుక బంగారం అవుతుందని అనుకోలేదని గృహ నిర్మాణదారులు అంటున్నారు.

కర్ణాటకకు తరలిపోతున్న ఇసుక

ఒక పక్క ఇసుక దొరక్క గృహ నిర్మాణ దారులు ఆవేదన వ్యక్తం చేస్తుండగా మరోవైపు అక్రమార్కులు నిత్యం పదుల కొద్దీ వాహనాల్లో ఇసుకను ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ధర్మవరం మండలంలోని సీసీ కొత్తకోట, పోతులనాగేపల్లి, కనంపల్లి, తుంపర్తి, మల్లాకాలువ గ్రామాల సమీపంలో చిత్రావతి నది ప్రవహిస్తుంది. ఈ నదిలో నాణ్యమైన ఇసుక లభిస్తుంది. అయితే ఈ నది నుంచి ఇసుకను ఎవరూ తరలించకూడదని అధికారులు నిబంధనలు విధించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కొందరు ఈ నది నుంచి రాత్రిళ్లు ట్రాక్టర్లతో మూడు బావులు అనే గ్రామ సమీపంలో ఉన్న గుట్ట వద్దకు తరలించి డంప్ చేస్తున్నారు. అక్కడి నుంచి ఇసుకను లారీల ద్వారా రాత్రి సమయాల్లో బెంగళూరుకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినా చర్యలు తీసుకోవడం లేదంటూ పలువురు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి

నిత్యం వందలాది ట్రాక్టర్లతో నది నుంచి ఇసుకను తరలిస్తున్నారని పోతులనాగేపల్లి, కనంపల్లి, సీసీకొత్తకోట, తుంపర్తి, మల్లాకాలువ గ్రామస్తులు చెప్తున్నారు. ఇసుకను తరలించడం ద్వారా భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుకను తరలించే ట్రాక్టర్లు రాత్రి సమయాల్లో గ్రామాల గుండా వెళ్తుండడంతో ఎక్కడ ప్రజల మీదకు దూసుకువస్తాయోనని భయాందోళన చెందుతున్నట్లు పోతులనాగేపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జేసీకి ఫిర్యాదు చేయడం జరిగిందని, ఆయన ఎలా స్పందిస్తారో చూడాలని పై గ్రామాలకు చెందిన రైతులు అంటున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన


ఎన్పీకుంట: వేరుశనగ పొలంలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ లోకేశ్వరరెడ్డి.

ఎన్పీకుంట: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలతో పాటు అధిక దిగుబడులు పొందవచ్చని ఏఓ లోకేశ్వరరెడ్డి సూచించారు. మండలంలోని గోపాలపురం, టి.ఎస్.కొత్తపల్లిలో మంగళవారం వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పంటలు సాగు చేసే సమయంలో లోదుక్కులు, విత్తనశుద్ధి, కొత్త వంగడాల ఎంపిక, అవసరమైన మేర ఎరువుల వాడకం, ట్రైకోడెర్మా ప్రాముఖ్యత, సేంద్రియ ఎరువుల వినియోగం, చీడపీడల నివారణ తదితర యాజమాన్య పద్ధతులపై ఆయన వివరించారు. అనంతరం ఆయా గ్రామాలలో సాగుచేసిన వరి, వేరుశనగ పంటలను పరిశీలించారు.

గాండ్లపెంట: సాగు చేసే ప్రతి పంటకూ విత్తనశుద్ధి తప్పనిసరి అని డీఆర్‌సీ ఏడీఏ సనావుల్లా, ఏడీఏ సత్యనారాయణ రైతులకు సూచించారు. మండలంలోని కటకంవారిపల్లి, తూపల్లి, యర్రజేనుపల్లి, సోమయాజులపల్లి పంచాయతీల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ బి.లక్ష్మీప్రియ, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: కంది పంటలో సస్య రక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడి సాధించొచ్చని కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త కిషోర్‌రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం చిగిచెర్ల, ఉప్పునేసినపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. చిగిచెర్లలో రాఘవరెడ్డి అనే రైతు సాగు చేసిన కంది పంటను పరిశీలించారు. ప్రస్తుతం కంది పంట పూత, పిందె దశలో ఉందన్నారు. పచ్చ పురుగు నివారణకు ఇమోమెక్టిన్ బెంజోయేట్ ఎకరానికి 100 గ్రాములు, అలాగే ఎకరానికి 19-19-19 ఒక కేజీ, అలాగే ఎకరానికి బోరాన్ 0.50 కేజీ మొగ్గ విడిచిన తరువాత పిచికారీ చేసుకోవాలన్నారు. ఏఓ ముస్తఫా, ఏఈఓ అశ్విని, వీహెచ్ఏ భార్గవ్, పశువైద్యాధికారి శేఖర్, టెక్నికల్ అధికారి బాబయ్య, ఏపీసీఎన్ఎఫ్ కోఆర్డినేటర్ ఆదినారాయణ, సర్పంచ్ ముత్యాలప్ప, రైతులు చిగిచెర్ల ఓబిరెడ్డి, రాఘవరెడ్డి, ఆనంద్, గణేష్‌రెడ్డి, రవి ప్రకాష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చిత్రావతి సుందరీకరణలో మేము సైతం!

- 'సంస్కృతి' ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల శ్రమదానం


చిత్రావతిలో చెత్త సేకరిస్తున్న విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: పట్టణంలోని చిత్రావతి నది సుందరీకరణకు సంస్కృతి విద్యాసంస్థల విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు నడుం బిగించారు. స్వచ్ఛతాహి సేవలో భాగంగా సుమారు 200 మంది విద్యార్థులు మంగళవారం చిత్రావతి నదిలోని చెత్తా చెదారం, పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. నదిలో దొరికిన చెత్తా చెదారాన్ని తమ సొంత ట్రాక్టర్లలో దూర ప్రాంతాలకు తరలించారు. అంతకుముందు ఫ్లెక్సీలు పట్టుకొని ర్యాలీ నిర్వహించి పర్యావరణ, పరిశుభ్రతపై పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్కృతి యాజమాన్యం, యువజన జాగృతీ సొసైటీ అధ్యక్షుడు వెంకటేష్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఖాదర్‌వలి, నెహ్రూ యువ కేంద్రం కార్యకర్త కరీం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు ఎంపిక


జిల్లా స్థాయి చెకుముకి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో నిర్వాహకులు

నల్లమాడ: మండలంలోని పాత బాలాజీ ఇంగ్లిష్ మీడియం స్కూల్, కురుమాల పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌కు ఎంపికైనట్లు నిర్వాహకులు తెలిపారు. మండల స్థాయి చెకుముకి టాలెంట్ పరీక్ష మంగళవారం పాత బాలాజీ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో నిర్వహించారు. ఏడు పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా పాత బాలాజీ పాఠశాల విద్యార్థులు వై.శివసాయి కుమార్ రెడ్డి, పూజిత, చంటి జిల్లా స్థాయి పరీక్షకు ఎంపికయ్యారన్నారు.

ఓడీచెరువు: శాస్త్రీయ ఆలోచనలతోనే సమాజాభివృద్ధి సాధ్యమని జేవీవీ అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో గౌనిపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు గౌతమ్ కుమార్, షరీఫ్, మనోహర్ విజేతలుగా నిలిచారు. హెచ్‌ఎంలు శోభారాణి, గౌరీశంకర్‌రెడ్డి, పీడీ గోపి, జయశంకర్, పవన్, చంద్ర పాల్గొన్నారు

ధర్మవరం అర్బన్: మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో కాకతీయ విద్యానికేతన్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని కరస్పాండెంట్ శెట్టిపి నిర్మలాదేవి, డైరెక్టర్లు శెట్టిపి సూర్యప్రకాష్‌రెడ్డి, పద్మ తెలిపారు. మంగళవారం స్థానిక కాకతీయ విద్యానికేతన్‌లో మండల స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను వారు అభినందించారు. వారు మాట్లాడుతూ చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో మండల స్థాయిలో లిఖిత, అంజుమ్, జస్వంత్‌రెడ్డి 40 మార్కులకుగాను 34 మార్కులు సాధించి, ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించారని తెలిపారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల అడ్డగింత


నిరసన తెలుపుతున్న దృశ్యం

నల్లమాడ: వంకరకుంట గ్రామ సమీపాన జరుగుతున్న గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే రోడ్డు పనులను మంగళవారం వంకరకుంట, బసిరెడ్డిపల్లి, సానేవారిపల్లి గ్రామాల ప్రజలు అడ్డుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ హైవే పనులుతో సత్యసాయి పైప్‌లైన్ తెగిపోయి ఆరు నెలల నుంచి గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. ఈ విషయాన్ని పలు దఫాలుగా రోడ్డు కాంట్రాక్టర్ల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదన్నారు. పైప్‌లైన్‌లు పునరుద్ధరించేవరకు రోడ్డు పనులు చేపట్టనివ్వమని భీష్మించుకున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకులు, నల్లమాడ మాజీ ఎమ్మెల్యే టీడీ నాగరాజారెడ్డి అక్కడికి చేరుకొని ఆందోళనకారులకు సర్దిచెప్పారు. సమస్యపై కాంట్రాక్టర్లతో చర్చించారు. పైప్‌లైన్‌లను మూడు రోజుల్లో పునరుద్ధరిస్తామని కాంట్రాక్టర్లు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. వంకరకుంట సర్పంచ్ కుళ్లాయప్ప, నాయకులు ఓబిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నాగప్ప, కే. ఓబిరెడ్డి, కేశప్ప తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రశ్నించేతత్వంతోనే మూఢనమ్మకాలకు అడ్డుకట్ట

ధర్మవరం అర్బన్: ప్రతి విద్యార్థీ ప్రశ్నించే తత్వం అలవర్చుకొని మూఢనమ్మకాలకు అడ్డుకట్ట వేయాలని ఎంఈఓ గోపాల్‌నాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎన్జీఓ హోంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముఖి సైన్స్ సంబరాలు నిర్వహించారు. ఎంఈఓ గోపాల్‌నాయక్, జనవిజ్ఞానవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు మాట్లాడారు. సైన్స్ ఫలితాలు సామాన్యులకు చేరువ కావాలంటే ప్రజలు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలన్నారు. హిందీ పండిట్ వేణుగోపాల్ మాట్లాడుతూ మూఢనమ్మకాలు లేని సమాజం కోసం ప్రయత్నం చేస్తున్న జేవీవీ కృషి అభినందనీయమన్నారు. అనంతరం మండలస్థాయి చెకుముఖి పరీక్షల పత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు సీతారామయ్య, మాజీ మండల విద్యాధికారి రాజశేఖర్, జేవీవీ సభ్యులు నరేంద్రబాబు, ఖలందర్, సైన్స్ ఉపాధ్యాయులు గోపి, శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లంబర్లకు న్యాయం చేయాలి

ధర్మవరం అర్బన్: పట్టణంలో బీజేపీ నాయకులు దౌర్జన్యంగా ప్లంబర్ల ప్లాట్లు, పునాదులు, షెడ్లు తొలగించడం అన్యాయమని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం నాయకులు ఎస్‌హెచ్‌బాషా, శేషంపల్లి మారుతి, రమణ ఆయుబ్‌ఖాన్, హరి అన్నారు. వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణంలోని 650-2 సర్వేనంబర్‌లో ప్లంబర్లకు కేటాయించిన ప్లాట్లలో బీజేపీ నాయకులు నాగరాజు, సోము, బాలకృష్ణయాదవ్ దౌర్జన్యంగా హిటాచీతో నిర్మాణాలను కూల్చేశారన్నారు. దాదాపు రూ.15 లక్షల వరకు నష్టం వాటిల్లిందన్నారు. మంత్రి సత్యకుమార్‌యాదవ్ స్పందించి బాధితులకు నష్టపరిహారం చెల్లించి, ప్లంబర్లకు న్యాయం చేయాలని తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత

కదిరి టౌన్: మండలంలోని కుమ్మరవాండ్లపల్లి పంచాయతీ మత్తనగారిపల్లికి చెందిన సూరినేని రామ్మోహన్ భార్య పెద్దక్క మృతి చెందింది. పేద కుటుంబం కావడంతో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షుడు డాక్టర్ బత్తల హరిప్రసాద్ ఆమె దహన సంస్కారాలకు ఇచ్చిన రూ.10 వేలను మాజీ సర్పంచ్ బత్తల వెంకటరమణ ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సూరినేని వెంకటరమణ, కిరణ్, శ్రీనివాసులు, శీనా తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో బీజేపీని బలపరచండి

పుట్టపర్తి రూరల్: ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీని బలపరచాలని కర్ణాటక మాజీ డిప్యూటీ సీఎం అశోక్ పిలుపునిచ్చారు. బీజేపీ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ అధ్యక్షతన మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదుపై సమావేశం జరిగింది. ఈసందర్భంగా ఆయనతోపాటు చిక్బళ్లాపూర్ ఎంపీ సుధాకర్, పార్టీ ప్రధాన కార్యదర్శి దయాకర్‌రెడ్డి మాట్లాడారు. దశాబ్దాలుగా పరిష్కారానికి నోచుకోని అనేక సమస్యలను పదేళ్లలో పరిష్కరించామన్నారు. మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మిట్టు వంశీ, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు దేవానంద్, తలుపుల గంగాధర్, రమేష్‌రెడ్డి, సతీష్, సుదర్శన్, రాష్ట్ర కల్లుగీత ఫెడరేషన్ కన్వీనర్ హరికృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు కొండమరాజు, ప్రధాన కార్యదర్శి కత్తి రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలల సంరక్షణ కమిటీ


పిల్లల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్

ధర్మవరం రూరల్: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగమల్లీశ్వరి ఆధ్వర్యంలో బాలల సంరక్షణ కమిటీని మంగళవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ధర్మవరం రైల్వే స్టేషన్ వద్ద ఆటో డ్రైవర్లు, రైల్వే స్టేషన్ సిబ్బంది, స్టేషన్లో తిను బండారాలు విక్రయించే వారితో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో డీసీపీఓ మహేష్, రైల్వే స్టేషన్ మేనేజర్ సురేష్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కుమార్, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్, సిహెచ్‌ఐ దామోదర్, సీడీపీఓ లక్ష్మి తదితరులు హాజరయ్యారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ మాట్లాడుతూ రైల్వే స్టేషన్‌లో ఎవరైనా పిల్లలు తప్పిపోయినట్లు గమనిస్తే వెంటనే రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పిల్లల సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆమె సూచించారు. అలాంటి పిల్లలను గుర్తించినట్లయితే టోల్ ఫ్రీ నంబర్ 1098కి కాల్ చేసి, అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.

నేడు గ్రామసభలు

తనకల్లు: మండలంలోని 17 గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో బుధవారం గ్రామసభలను నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వెంకటరమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామసభల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా కొత్తగా మంజూరైన పనులను వివరిస్తారన్నారు. ఉపాధి కూలీలు, ఆయా గ్రామాల ప్రజలు హాజరుకావాలన్నారు.

మున్సిపల్ డీఈకి వినతి

కదిరి టౌన్: గత నెలలో విజయవాడలోని వరద ముంపు ప్రాంతాల్లో పారిశుధ్య పనుల కోసం కదిరి నుంచి మున్సిపల్ కార్మికులు వెళ్లారు. వారికి డీఎంఏ సర్క్యులర్ ప్రకారం రెండు జతల దుస్తులు, కూలి డబ్బులు ఇవ్వాలని మున్సిపల్ డీఈకి సీఐటీయూ నాయకులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బాలక్రిష్ణ, తిరుపాలు, జనార్దన్, చిన్నకృష్ణ, రాజు, రామాంజులు సీఐటీయూ నాయకులు జగన్మోహన్, రామ్మోహన్, ముస్తక్, రఫి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థినులు


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్, పీఈటీలు

చెన్నేకొత్తపల్లి: స్థానిక ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థినులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ స్వర్ణలత, పీఈటీ కొండమ్మ మంగళవారం తెలిపారు. ఇటీవల నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్- 17,అండర్-19లో బాక్స్ లంగడి(కుంటే ఆట)లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చడంతో నిర్వాహకులు వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. వీరు ఈనెల 7 నుంచి చండీఘర్‌లో జరిగే జాతీయ స్థాయిపోటీల్లో పాల్గొంటారన్నారు. ఈసందర్భంగా హెచ్‌ఎం, పీఈటీ విద్యార్థినులను అభినందించారు.

డాక్టరేట్ గ్రహీతకు సన్మానం

పుట్టపర్తి టౌన్: గుమ్మయ్యగారిపల్లికి చెందిన దేవరాజస్వామి ఆలయాల అభివృద్ధికి చేసిన కృషికిగాను ఇటీవల తమిళనాడుకు చెందిన హోసూర్ ఏషియన్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. మంగళవారం స్థానిక సాయి ఆరామంలో నాయీ బ్రాహ్మణులు కమతం రమేష్ మాల్యవంతం మారుతీ ప్రసాద్ ఆధ్వర్యంలో దేవరాజ స్వామిని పూలమాలలు, శాలువాతో సత్కరించారు.

భర్తతో గొడవపడి భార్య ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కృష్ణవేణి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేతిరెడ్డి పైకాలనీకి చెందిన కృష్ణవేణి మంగళవారం రాత్రి మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. టూటౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. పట్టణంలోని కేతిరెడ్డి పైకాలనీకి చెందిన ప్లంబర్ వీరనారాయణతో భార్య కృష్ణవేణి కుటుంబ విషయంపై గొడవపడ్డారు. దీంతో మనస్తాపం చెందిన కృష్ణవేణి ఇంట్లో ఉన్న గుర్తుతెలియని మాత్రలు అధికమోతాదులో మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి ఆమెను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలకు చేసిన సేవలతోనే గుర్తింపు


ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్: ప్రజలకు చేసిన సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు వస్తుందని ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి అన్నారు. మంగళవారం బదిలీపై వెళ్తున్న ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డికి రెవెన్యూ సిబ్బంది వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి, సన్మానించారు. ఈ సందర్భంగా సమావేశానికి హాజరైన వక్తలు మాట్లాడుతూ వెంకటశివరామిరెడ్డి ఎన్నికల నిమిత్తం ధర్మవరానికి వచ్చినట్లు తెలిపారు. ఎన్నికలు సజావుగా నిర్వహించడంలో వారికి వారే సాటి అన్నారు. అదే విధంగా రెవెన్యూ డివిజన్ పరిధిలోని దీర్ఘకాలిక పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ సమస్యలను జిల్లా కలెక్టర్‌తో చర్చించి చాలా వాటిని పరిష్కరించారని వారు కొనియాడారు. కార్యక్రమంలో డీఐలు మురళీకృష్ణ, శామ్యూల్ బాబు, డీఏఓ కతిజున్ కుబ్రా, ఏడు మండలాలకు చెందిన తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన సచివాలయ సిబ్బంది

పుట్టపర్తి అర్బన్: శ్రీసత్యసాయి జిల్లాలో మంగళవారం సామాజిక భద్రతా పింఛన్లను 96.93 శాతం పంపిణీ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. జిల్లాలో 9551 మంది సిబ్బంది ద్వారా 2,59,032 మంది లబ్ధిదారులకు రూ.111.15 కోట్లు పంపిణీ పూర్తి చేశామన్నారు. తక్కిన వారికి గురువారం ఉదయం అందజేస్తామని వివరించారు.

పుట్టపర్తి: తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి నెల నుంచే పెంచిన ఫించన్ మొత్తాన్ని పింఛన్‌దారులకు అందిస్తున్నామని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అన్నారు. మంగళవారం ఆమె కొత్తచెరువు, బుక్కపట్నంలో లబ్ధిదారులకు పింఛన్ మొత్తం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సజావుగా పింఛన్ల పంపిణీ

తలుపుల : మండలంలోని కుర్లిరెడ్డివారిపల్లిలో సామాజిక పింఛన్లను మంగళవారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పంపిణీ చేశారు. అనంతరం బట్రేపల్లి గ్రామంలో తాగునీటి ట్యాప్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రెడ్డిశేఖర్, ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు, ఏఓ రామానాయక్ పాల్గొన్నారు.

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో సచివాలయ సిబ్బంది మంగళవారం వృద్ధులు, దివ్యాంగులు తదితరులకు పింఛన్ పంపిణీ చేశారు. మున్సిపల్ పరిధిలో దాదాపు 98 శాతం పింఛన్ పంపిణీ పూర్తి చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్ తెలిపారు.


పింఛన్ సొమ్ము అందిస్తున్న ఎమ్మెల్యే సింధూరరెడ్డి

6,142 మందికి పింఛన్లు పంపిణీ

బత్తలపల్లి: మండలంలో వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులు మొత్తం 6,142 మందికి మంగళవారం పింఛన్లు పంపిణీ చేశారు. మొత్తం పింఛన్లు 6,306 ఉండగా, సాయంత్రం 4.30 గంటల వరకు 97శాతం పంపిణీ చేశారు.

ప్రశాంత జీవనం సాగించాలి

బత్తలపల్లి: గ్రామాల్లో ప్రశాంత జీవనం సాగించాలని ఎస్‌ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని పోట్లమర్రిలో తమ సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. గ్రామస్తులతో ఆయన సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అనవసరంగా గొడవలు పెట్టుకోవడం, ఘర్షణలకు దిగడం వంటి చర్యలకు పాల్పడవద్దన్నారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పేకాట, మట్కా, మద్యానికి దూరంగా ఉండాలని, మద్యం విక్రయించేవారి సమాచారం ఇవ్వాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ప్రతి ఒక్కరూ తప్పకుండా ట్రాఫిక్ నియమాలను పాటించాలని సూచించారు. రౌడీ షీటర్లకు, గత కేసుల్లో నిందితులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.